రాగము: ఘుద్ధవసంతం
రేకు: 0141-01
సంపుటము: 2-178

॥పల్లవి॥ దీనరక్షకుఁ డఖిలవినుతుఁడు దేవదేవుఁడు రాముఁడు
జానకీపతిఁ గొలువుఁడీ ఘనసమరవిజయుఁడు రాముఁడు

॥చ1॥ హరుని తారకబ్రహ్మమంత్రమై యమరిన యర్థము రాముఁడు
సురలఁ గాచి యసురల నడఁచిన సూర్యకులజుఁడు రాముఁడు
సరయువందును ము క్తిమారలు జనుల కొసఁగెను రాముఁడు
హరియె యీతఁడు హరివించల కాదిపురుషుఁడు రాముఁడు

॥చ2॥ మునులఋషులకు నభయమొసఁగిన మూలమూరితి రాముఁడు
మనసులోపలఁ బరమయోగులు మరుగుతేజము రాముఁడు
పనివి మీఁదటి బ్రహ్మపట్టము బంటు కొసఁగెను రాముఁడు
మనుజవేషముతోడ నగజకు మంత్రమాయను రాముఁడు

॥చ3॥ బలిమి మించిన దైవికముతో భక్తసులభుఁడు రాముఁడు
నిలిచి తనసరిలేని వేలుపు నిగమవంద్యుఁడు రాముఁడు
మెలుపు శ్రీవేంకటగిరీంద్రముమీఁది దేవుఁడు రాముఁడు
వెలసె వావిలిపాటి లోపలి వీరవిజయుఁడు రాముఁడు